

## నేటి నుంచి టెట్

జిల్లా ఏపీ టీచర్ ఎలిజిబిలిటి టెస్టు (ఏపీ టెట్ - 2024 కంప్యూటర్ బేస్డ్ పరీక్ష) మంగళవారం నుంచి జిల్లావ్యాప్తంగా కేటాయించిన పరీక్షా కేంద్రాలలో ప్రారంభం కానుంది. -8లో



## ప్రాణం తీసిన విద్యుత్ కంచె

గోపవరం మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామానికి చెందిన పందిపాటి వెంకటసుబ్బయ్య (17) అనే యువకుడు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. -8లో

గరిష్టం/కనిష్టం
36.1/22.0

## వాతావరణం

జిల్లాలో సోమవారం 22.0 - 36.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### 29న జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరులోని మండల సమైక్య కార్యాలయంలో ఈనెల 29వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ అధికారి నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ అభ్యర్థులు తమ పేర్లను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ లింక్‌లో రిజిష్టర్ చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 90004 01382, 99121 15622 నంబర్లలో సంప్రదించాలన్నారు.

### బీఈడీ, ఎంఈడీ పరీక్షలు ప్రారంభం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ, ఎంఈడీ విద్యార్థులకు సోమవారం నుంచి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 13 కళాశాలల్లో బీఈడీ, ఎంఈడీ మూడో సెమిస్టర్ (రెగ్యులర్, సప్లిమెంటరీ), మొదటి సెమిస్టర్ (సప్లిమెంటరీ) పరీక్షలు మొదలయ్యాయి. రెగ్యులర్ పరీక్షలకు ఉదయం 2551 మంది, సప్లిమెంటరీ పరీక్షలకు 346 మంది హాజరయ్యారు. పరీక్షలను వి శ్వ విద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి, హైపవర్ కమిటీ సభ్యులు ఆచార్య డి. విజయరాఘవప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయన్నారు.

### జాతీయస్థాయిలో సత్తాచాటిన విద్యార్థులు



అవార్డు అందుకుంటున్న కమలాపురం విద్యార్థులు

కమలాపురం: కమలాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ఈ నెల 23వ తేదీన చైన్నెలోని మురుగప్ప పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన సాంకేతిక ప్రదర్శన (టెక్నికల్ ఎగ్జిబిషన్) లో ప్రదర్శించిన ప్రాజెక్టుకు ప్రథమ బహుమతి, పేపర్ ప్రజెంటేషన్ విభాగంలో ద్వితీయ బహుమతి సాధించి జాతీయ స్థాయిలో సత్తా చాటారు. కాగా సోమవారం స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులను ప్రిన్సిపల్ డా.బి.వెంకటేశ్వర్లు, మార్గదర్శులు మునిశేఖర్ రెడ్డి, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

### జేఎన్‌టీయూ బీటెక్ ఫలితాలు విడుదల

పులివెందుల రూరల్: పులివెందుల జెఎన్‌టీయూ కళాశాలలో ఇటీవల నిర్వహించిన బీటెక్ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ రెగ్యులర్, మూడో సంవత్సరం మొదటి సెమిస్టర్, రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ రమణా రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సూర్యనారాయణరెడ్డిలు తెలిపారు. బీటెక్ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలకు 304మంది విద్యార్థులు నమోదు చేసుకోగా.. 158మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. బీటెక్ రెండో సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలకు 337మంది నమోదు చేసుకోగా.. 195మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. బీటెక్ మూడో సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలకు 343మంది నమోదు చేసుకోగా.. 255మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఈ ఫలితాలను తక్కువ సమయంలోనే విడుదల చేసినందుకు పరీక్ష కేంద్ర విభాగాధిపతులు డాక్టర్ హుస్సేన్ వల్లి, డాక్టర్ సాంబయ్యలను వారు అభినందించారు.విద్యార్థులు కళాశాలల వెబ్ సైట్‌లో పరీక్ష ఫలితాలను తెలుసుకోవచ్చని వారు తెలిపారు.

### ‘ఆడుదాం ఆంధ్ర’ విజేతలకు అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

కడప స్పోర్ట్స్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ‘ఆడుదాం ఆంధ్ర’ మెగా క్రీడాటోర్నమెంట్‌లో జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు సత్తాచాటి పతకాలు సాధించిన విషయం తెలిసిందే. బ్యాడ్మింటన్ మహిళల విభాగంలో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన శ్రీలత-వెన్నెల (కడప) జోడి రజత పతకం, పురుషుల విభాగంలో అబ్దుల్ -ఖాజా (కడప) జోడి కాంస్య పతకం సాధించారు. వీరితో పాటు పురుషుల క్రికెట్ పోటీల్లో జిల్లా జట్టు (ప్రొద్దుటూరు జట్టు) పాల్గొని కాంస్యపతకం సాధించింది. వీరిని సోమవారం జిల్లా కలెక్టర్ వి. విజయరామరాజు, జాయింట్ కలెక్టర్ జి. గణేష్‌కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు సాధించిన ట్రోఫీలను కలెక్టర్‌కు అందజేశారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించడం అభినందనీయమన్నారు డీఎస్‌డీఓ కె. జగన్నాథరెడ్డి, కోచ్‌లు సుదర్శన్‌సిద్ధికి, జాకీర్, అబ్దుల్ మునాఫ్, శ్యామ్యూల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఐదేళ్లు.. ఆనందాల సాగు

- రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట
- జిల్లాలో 2,31,383 మందికి అందిన సాయం
- పండుగలా సాగుతున్న వ్యవ‘సాయం’


రైతు భరోసా కేంద్రం


విత్తనాలు వేస్తున్న కూలీలు

| పథకం పేరు | లబ్ధి పొందిన రైతులు | లబ్ధి (రూ.కోట్లలో) |
|---|---|---|
| రైతు భరోసా | 2,31,383 | 1147.45 |
| వైఎస్సార్ సున్నావడ్డీ | 90661 | 26.32 |
| వైఎస్సార్ ఫ్రీ క్రాపు ఇన్సూరెన్స్ | 81705 | 442.08 |
| ఇన్‌పుట్ సబ్సిడీ | 1,33,514 | 225.08 |
| వైఎస్సార్ బీమా | 4284 | 66.61 |

ఇది కదా.. అభివృద్ధి

కడప అగ్రికల్చర్: రైతు బాగుంటే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ ఐదేళ్ల పాలనలో రైతును రాజు చేశారు. ఒక నాడు వ్యవసాయం దండుగ అన్న ప్రతిపక్ష పార్టీకి నేడు వ్యవసాయం దండుగ కాదు పండగా అని నిరూపించారు. పంటలసాగుకు సంబంధించి సీజన్‌కు ముందు పెట్టుబడిసాయం అందించడం.. వారికి అవసరమైన విత్తనాలను సబ్సిడీపై ఇవ్వడం.. సాగుకు అవసరమైన యంత్ర పరికరాలు, పంట నష్టపోతే పరిహారం ఇలా రైతులకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా నిలుస్తోంది. అన్నదాతల అభ్యున్నతికి అన్ని విధాలుగా పెద్దపీట వేసి రైతేరాజు అని నిరూపిస్తోంది. ఉన్న ఊర్లోనే రైతులకు అన్ని రకాల సేవలు అందించేందుకు రైతు భరోసా కేంద్రాలను(ఆర్‌బీకే) ఏర్పాటు చేసింది. వీటన్నింటిని రైతులు సకాలంలో సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని ఈ ఐదేళ్లు పండగలా చేసుకుంటూ ఆనందంగా సాగారు.

- అన్నదాతల అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని విధాలుగా పెద్దపీట వేసింది.వీరికోసం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పలు పథకాలు అమలు చేశారు. సీజన్‌కు ముందు పంటలసాగుకు అవసరమైన పెట్టుబడిని రైతు భరోసా పథకం కింద ఏడాదికి 13,500 చొప్పున నేరుగా రైతు ఖాతాలకు జమ చేస్తున్నారు. ఇలా ఐదేళ్లపాటు జిల్లాలో 2,31,383 మంది రైతులకు రైతు భరోసా పథకం ద్వారా రూ. 1147.45 కోట్ల ఆర్థిక ప్రయోజనం లభించింది. దీంతో రైతన్నలకు పెట్టుబడి కష్టాలు తొలగి ఉత్సాహంగా పంటలను సాగు చేపట్టారు. కౌలు రైతులకు సైతం సీసీఆర్‌సీ కార్డులను అందచేశారు. వారికి కూడా పంటలసాగు కోసం పెట్టుబడి సాయం కింద రైతు భరోసా పథకం అమలు చేశారు. దీంతో అన్నదాతలు వ్యవసాయాన్ని పండగాలా చేస్తున్నారు.

**అన్నదాతలకు అండ..**

గత ప్రభుత్వ పాలనలో రైతులు సాగుకు సంబంధించి ఏ చిన్న అవసరం వచ్చినా మండల కేంద్రానికో, నియోజకవర్గ కేంద్రానికో, జిల్లా కేంద్రానికో వెళ్లాల్సి వచ్చేది. వీటిని గమనించిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నదాతల కష్టాలను తొలగిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పంటలసాగుకు కావాల్సిన అన్ని రకాల సేవలను అందిస్తున్నారు. వీటితోపాటు నకిలీలకు చెక్ పెడుతూ.. నాణ్యతకు పెద్దపీట వేస్తూ.. రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు నిర్దిష్టమైన ధరలకు అందజేస్తూ రైతులకు అడుగడుగునా అండగా నిలుస్తున్నారు. అంతేకాకుండా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంటలకు నష్టం జరిగితే పరిహారాన్ని రైతుల ఖాతాలకు జమ చేస్తున్నారు. పంటలకు బహిరంగ మార్కెట్‌లో ధరలు లేనప్పుడు ప్రభుత్వమే మద్దతు ధరను ప్రటించి రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తుంది. రైతులకు ఉచిత పంటలబీమా సదుపాయం కల్పించి ఊరటనిస్తోంది.

**చంద్రబాబు హయాంలో...**

రుణమాఫీ హామీని టీడీపీ అధినేత చంద్రబాబు తుంగలోకి తొక్కారు. రైతు సంక్షేమానికి ఒక్క పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయలేకపోయారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంట కాలువలకు నీరు రాకపోవడంతో క్రాప్‌హాలిడే ప్రకటించారు. సీజన్‌కు ముందు పంట పెట్టుబడికి డబ్బులు దొరికేవి కావు. ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక వడ్డీతో అప్పు తెచ్చుకొని పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి. పంట దిగుబడులు సక్రమంగా రాక అప్పుల బాధ తాళలేక చాలా మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. దీనికి తోడు అప్పట్లో బ్యాంకులు కూడా పంట రుణాలను అంతగా ఇచ్చేవారు కాదు. దీంతో అన్నదాతలు అన్ని రకాలు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చేంది. ఏది ఏమైనా చంద్రబాబు హయాంలో రైతు సంక్షేమం మాటల్లో తప్ప చేతల్లో కనిపించేది కాదు.

### రైతుల ముంగిటకే అన్ని సేవలు..



ఒకప్పుడు సీజన్ వస్తుందంటే భయం వేసేది. పెట్టుబడి సాయం, ఎరువులు, విత్తనాలకు అవస్థలు పడాల్సి వచ్చేది.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సమస్యలు లేవు. ఉన్న ఊర్లోనే రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, విత్తనాలు ఉన్న ఊర్లోనే దొరుకుతున్నాయి. దీంతొసంతోషంగా వ్యవసాయం సాగిస్తున్నాం. - పెద్దిరెడ్డి రామకృష్ణారెడ్డి, రైతు, చియ్యపాడు, చాపాడు మండలం

### నాణ్యమైన విత్తనాలు ఇస్తున్నారు



గతంలో విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేయాలంటే నకిలీలతో భయం వేసేంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అగ్రిల్యాబ్స్‌ను ఏర్పాటు చేసింది. విత్తనాలు, ఎరువుల నాణ్యతను పరిశీలించిన తరువాతే రైతులకు అందిస్తున్నారు.దీంతో ఎలాంటి భయం లేకుండా పంటలను సాగు చేసుకుంటున్నాం. - మల్లారెడ్డి, రైతు, శ్రీనివాసపురం, పెండ్లిమర్రి.

### పథకం..రైతులకు ఉపయోగం



ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అన్నదాతలకు ఉపయోగకరంగా ఉన్నా యి. వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని ఐదేళ్లపాటు విజయవంతంగా అమలు చేయడం రైతులకు బాగా కలిసి వచ్చింది. దీంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యవసాయం చేసుకుంటున్నారు. - నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి

## లెదర్ పరిశ్రమ ఏర్పాటుకు కృషి


మాట్లాడుతున్న లిడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ రాజశేఖర్

బద్వేలు అర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె రెవెన్యూ పొలం సర్వే నంబర్ 1580/బి లో చర్మకారుల సొసైటీకి కేటాయించిన 3.64 ఎకరాల స్థలంలో ప్రభుత్వం ద్వారా నిధులు కేటాయించిన లెదర్ పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేస్తానని లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కాకుమానురాజశేఖర్ పేర్కొన్నారు. సోమవారం బద్వేలు పర్యటనకు వచ్చిన ఆయన తొలుత లిడ్‌క్యాప్ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం బాబుజగ్జీవన్‌రామ్, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఎన్‌జీవో హోంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లిడ్‌క్యాప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో చర్మకారుల కోసం మంజూరు చేసిన 3.64 ఎకరాల స్థలాన్ని కబ్జాకు గురికాకుండా ప్రహరీ గోడ ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల కోసం అనేక పథకాలు రూపొందించారని అన్నారు. కార్యక్రమంలో లిడ్‌క్యాప్ డైరెక్టర్లు రాజేశ్వరి, క్రిష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు గొడుగునూరుప్రతాప్, ఎస్సీ సెల్ నాయకులు మల్లికార్జున, దళిత ప్రజాసంఘాల నాయకులు పిచ్చయ్య, శిఖామణి, ఓబయ్య, సుధాకర్, బాలయ్య, శ్రీను, ఓ.వి.ఎస్.ప్రసాద్, జయరాజ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### 29న జాబ్‌ఫెస్ట్-24

వైవీయూ: కడపలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 29వ తేదీ ఉదయం జాబ్ ఫెస్ట్-24 నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా తెలిపారు. ఏపీ కళాశాల విద్య కమిషనరేట్, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, కళాశాల జేకేసీ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఫెస్ట్‌లో 20 కంపెనీల ప్రతినిధులు హాజరై ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9398639980, 9390052901 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

# పది విద్యార్థులకు శుభవార్త

- ఆర్టీసీలో ఉచిత ప్రయాణం
- హాల్‌టికెట్ చూపించి బస్సులో పరీక్ష కేంద్రానికి వెళ్లొచ్చు

రాజంపేట: పదోతరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత ప్రయాణం అవకాశాన్ని ప్రభుత్వం ఈ ఏడాది కూడా కల్పించింది.టెన్త్ పరీక్ష విద్యార్థులు హాల్‌టికెట్‌తో బస్సులో సురక్షితంగా పరీక్షా కేంద్రానికి చేరుకోవచ్చని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆర్టీసీ అధికారులు ఆదిశగా చర్యలు తీసుకున్నారు.

- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 681 పల్లె వెలుగు సర్వీసులు నడుస్తున్నాయి. వైఎస్సార్ జిల్లాలో కడప, మైదుకూరు, బద్వేలు, జమ్మలమడుగు, పులివెందుల, ప్రొద్దుటూరులో డిపోలు ఉన్నాయి. అలాగే అన్నమయ్య జిల్లాలో రాయచోటి, రాజంపేట, మదనపల్లె-1, మదనపల్లె-2, పీలేరు డిపోలున్నాయి. వీటి పరిధిలో పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు బస్సులు తిరుగుతున్నాయి. అన్నమయ్య జిల్లా వరకు 348, వైఎస్సార్ కడప జిల్లాలో 333 పల్లె వెలుగు బస్సులు టెన్త్ పరీక్ష రాసే విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి.
- వైఎస్సార్ జిల్లాలో 289 స్కూళ్లకు 27858 మంది టెన్త్ పరీక్షలకు హాజరవుతున్నారు. కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందుల, కమలాపురం, బద్వేలు నియోజకవర్గాల పరిధిలో 153 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశారు. వివిధ పల్లె ప్రాంతాల నుంచి విద్యార్థులు చేరాల్సిన సెంటర్లకు పల్లె వెలుగు సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో ఉచితంగా వెళ్లేందుకు బస్సులో హాల్‌టికెట్ చూపిస్తే చాలని ఆర్టీసీ అధికారులు చెపుతున్నారు.రాష్ట్ర ప్రభుత్వ తీసుకున్న నిర్ణయం పట్ల టెన్త్ రాసే పేద, మధ్యతరగతి విద్యార్థులు, వారి తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- పదోతరగతి పరీక్షలు అన్నమయ్య జిల్లాలో 504 స్కూళ్లకు 25316 మంది పది పరీక్షలు రాయనున్నారు. రాజంపేట, మదనపల్లె, పీలేరు, రాజంపేట, తంబళ్లపల్లె,రైల్వేకోడూరు నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే పరీక్షకేంద్రాలను అన్ని సదుపాయాలతో సిద్ధం చేశారు. ఎ,బీ,సీ కేటగిరీ వారీగా ఏ కేటగిరీ కింద 58.. బీ కేటగిరీ కింద 56, సీ కేటగిరి కింద 15 సెంటర్లను ఏర్పాటుచేశారు. వివిధ పల్లెల నుంచి వచ్చే పదోతరగతి విద్యార్థులు హాల్‌టికెట్స్ చూపించి తమ ప్రాంత పరిధిలో నడిచే పల్లె వెలుగు సర్వీసుల ద్వారా ఆయా సెంటర్లకు చేరుకోనున్నారు.

### విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



ఆర్టీసీ అందిస్తున్న సౌకర్యాన్ని టెన్త్ పరీక్షలు రాసే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. కండక్టర్‌కు హాల్‌టికెట్ చూపిస్తే చాలు పరీక్ష కేంద్రానికి ఉచితంగా వెళ్లవచ్చు. వచ్చేనెల 18 నుంచి 30 వరకు ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది.
- గోపాల్‌రెడ్డి, డీపీటీఓ, కడప

# పేదలకు ఉన్నత విద్యే లక్ష్యం

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


వేల్పులలో ప్రాథమికోన్నత పాఠశాల భవనాలను ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేముల: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి పేదవాడికి ఉన్నత విద్యనందించాలన్నదే సీఎం వైఎస్ జగనన్న ధ్యేయమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వేల్పుల పంచాతీలోని వేల్పుల, బెస్తవారిపల్లె గ్రామాల్లో మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ లింగాల ఉషారాణిల ఆధ్వర్యంలో జరిగిన పలు అభివృద్ధి పనులను సోమవారం ప్రారంభించారు. పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డి, వైఎస్ కొండారెడ్డి, మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కె.వెంకట బయపురెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవి కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామాల్లో నాడు - నేడుతో పాఠశాలల రూపురేఖలు మారాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు బోధన ప్రవేశపెట్టి కార్పొరేట్‌కు దీటుగా విద్యా బోధన అందిస్తున్నారన్నారు. గ్రామాల్లో ఇళ్లులేని అర్హులైన ప్రతి ఒక్కరికి స్థలంతో పాటు పక్కాగృహం మంజూరు చేసినట్లు చెప్పారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో 35లక్షల మందికి ఇంటి స్థలాలు ఇచ్చినట్లు తెలిపారు. గ్రామాల్లో లబ్ధిదారులు పక్కాగృహాలు నిర్మించుకోవడం ద్వారా జగనన్న కాలనీలు ఊర్లుగా మారాయన్నారు. బెస్తవారిపల్లెలో జగనన్న కాలనీని ప్రారంభించి ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు.పక్కాగృహాలను అందంగా నిర్మించుకున్నామని ఇదంతా జగనన్న చలువే అంటూ ఆయన వద్ద ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి గ్రామంలోనూ వాటర్ ప్లాంటును నిర్మించి మినరల్ వాటర్ అందిస్తున్నామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం బెస్తవారిపల్లె మదర్సాల అభివృద్ధి చేశామన్నారు. కడపలో మసీదు పునర్నిర్మాణానికి రూ.98లక్షలు మంజూరు చేశామన్నారు. షాదీఖానాల మరమ్మతులు, లేనిచోట నూతనంగా షాదీఖానాలు నిర్మిస్తున్నామన్నారు. ఇన్ని అభివృద్ధి పనులు చేసిన జగనన్నను ఆశీర్వదించాలన్నారు. మదర్సాలో ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అంతకుముందు ఆయన బెస్తవారిపల్లె సమీపంలోని భ్రమరాంబిక ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బెస్తవారిపల్లెలో జగనన్న కాలనీ, వాటర్ ప్లాంటు, రూ.75లక్షలతో నిర్మించిన మండల పరిషత్ పాఠశాల భవనాలను ప్రారంభించారు. అనంతరం మదర్సాకు చేరుకుని రూ.59లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభించారు. అక్కడ మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి ఏర్పాటు చేసిన బైకు ర్యాలీగా ఆయన వేల్పులకు చేరుకున్నారు. వేల్పులలో చర్చిని, బస్సు షెల్టర్‌ను, రూ.1.61కోట్లతో నిర్మించిన మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ నిర్మల, ఎంపీటీసీ బాబ్‌జాన్, ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, ఎంఈఓ చంద్రశేఖర్, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ ఓ.రసూల్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనుల లక్ష్యాన్ని ఛేదించాలి!

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల పనుల లక్ష్యాన్ని ఛేదించాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో వివిధ సంక్షేమ పథకాల అమలు తీరుపై జేసీ గణేష్ కుమార్, నగర పాలక సంస్థ కమీషనర్ ప్రవీణ్ చంద్, డీఆర్వో గంగాధర్‌గౌడ్ లతో కలిసి మండల అధికారులతో కలెక్టర్‌వీసీ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూయ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎలాంటి అలసత్వం వహించకుండా ప్రజలకు అందించాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి అన్‌ప్రాసెసెడ్ అర్జీలను పెండింగ్ లేకుండా ఏ రోజుకు ఆరోజు బీఎల్‌ఓలకు కేటాయించి చేసి వాటిని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక బోర్డు మీటింగ్ హాలు నుండి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కౌసర్ బాను, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, జెడ్పీ సీఈఓ సుధాకర్ రెడ్డి, డ్వామా, డీఆర్‌డీఏ, హౌసింగ్ పీడీలు యాదుభూషన్ రెడ్డి, ఆనంద్ నాయక్, కృష్ణయ్య హాజరయ్యారు.

**అర్జీలను త్వరగా పరిష్కరించాలి**

‘స్పందన’ కార్యక్రమం ద్వారా స్వీకరించే అర్జీలకు నాణ్యమైన పరిష్కారం అందించాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేటో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ ‘స్పందన’ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, డీఆర్వో గంగాధర్ గౌడ్, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్‌లు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

# రవాణా వ్యవస్థలో మేటిగా వైఎస్ఆర్ జిల్లా

- కలెక్టర్ విజయరామరాజు
- కడప రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- వర్చువల్ విధానంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ప్రధాని నరేంద్రమోదీ


అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప రైల్వేస్టేషన్‌తోపాటు జిల్లాలో రహదారి, విమానయాన సేవలు మరింత విస్తృతం కానున్నాయని, రవాణా వ్యవస్థలో వైఎస్ఆర్ జిల్లా మేటిగా నిలువనుందని జిల్లా కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. భారత రైల్వే మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజన్ పరిధిలోని 15 స్టేషన్లతో పాటు 24 రోడ్ అండర్ బ్రిడ్జిలకు, రూ. 20.35 కోట్ల కేంద్ర నిధులతో కడప రైల్వే స్టేషన్ అభివృద్ధి నిర్మాణ పనులకు ప్రధానమంత్రి వర్చువల్ విధానం ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక రైల్వే శుభం హాలు నుంచి జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ దార్శనిక దృక్పథం నుంచి ప్రేరణ పొంది, ప్రయాణికుల అనుభవాలు, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని రైల్వే స్టేషన్లను ఉన్నత స్థాయిలో అభివృద్ధి చేసి మార్పును తీసుకొచ్చేలా కేంద్ర రైల్వేశాఖ భారీ పరివర్తనకు నాంది పలికిందన్నారు. ‘అమృత్ భారత్ స్టేషన్’పథకం కింద రైల్వే స్టేషన్లలో ఆధునిక సౌకర్యాలను కల్పించడానికి ప్రణాళికలు రూపొందించిందన్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దాదాపు రూ.3.141 కోట్ల మొత్తం వ్యయంతో 72 స్టేషన్ల పునరాభివృద్ధికి ‘అమృత్ స్టేషన్’లుగా గుర్తించినట్లు చెప్పారు. అభివృద్ధి చెందుతున్న రైల్వే కూడలిగా ప్రాధాన్యతను సంతరించుకున్న కడప స్టేషన్‌ను దాదాపు రూ.20.35 కోట్ల వ్యయంతో ‘అమృత్ భారత్ స్కీమ్’కింద అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధమైందన్నారు. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా ఈ రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారంతో పాటు ప్రయాణ ప్రాంగణంలో అధునాతన ట్రాఫిక్ నియంత్రణ సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. జిల్లా ప్రజలకు కడప రైల్వేస్టేషన్‌తోపాటు కడప విమానాశ్రయం కూడా అధునాతన సౌకర్యాలను, విశిష్టమైన ఎయిర్‌లైన్స్ సేవలను అందించనుందని కలెక్టర్ పేర్కొన్నారు. కడప విమానాశ్రయం అభివృద్ధిలో భాగంగా రూ. 215 కోట్లతో కొత్త టర్మినల్ ఏర్పాటుకు టెండర్ల ప్రక్రియను పూర్తి చేసినట్లు, నెల రోజుల్లో అభివద్ధి పనులకు శిలాఫలకం వేయనున్నట్లు చెప్పారు. అంతేకాకుండా కడప-బెంగుళూ రు, కడప-తిరుపతి రహదారి, కడప-నెల్లూరు ప్ర ధాన రహదారులను విస్తృతం చేయనున్నట్లు చెప్పారు. అంతకు ముందు లైవ్ ద్వారా దేశ ప్రధాని ప్రసంగిస్తూ వేగవంతమైన రైల్వే సేవలను అందించే క్రమంలో రైల్వే స్టేషన్ల ఆధునీకరణకు కేంద్ర ప్రభుత్వం నడుం బిగించిందన్నారు. కడప ఆర్డీవో మధుసూదన్, సీనియర్ డివిజన్ ఇంజనీర్ అక్కిరెడ్డి, ఏడీ రాధాకృష్ణ, ఏడీ ఎస్‌టీఈ కాత్యాయకుమార్, చీఫ్ టీఐ ఉమర్ బాషా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషన్ రెడ్డి, నాయకులు సింగారెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

### అమృత్‌భారత్‌లో రాజంపేటకు చోటు


మాట్లాడుతున్న తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి

రాజంపేట: రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డి కృషితో రాజంపేట రైల్వేస్టేషన్ అభివృద్ధికి అమృత్‌భారత్ పథకం ద్వారా బీజం పడిందని, ఈ పనులను దేశ ప్రధాని మోదీ వర్చువల్ విధానంతో ప్రారంభించడం హర్షణీయమని గుంతకల్ రైల్వే డివిజనల్ యూజర్స్ కమిటీ సభ్యుడు తల్లెం భరత్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం రాజంపేట రైల్వేస్టేషన్‌లో అమృత్‌భారత్ పథకం పనుల ప్రారంభోత్సవ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.5కోట్ల వ్యయంతో రాజంపేట రైల్వే స్టేషన్ రూపురేఖలు మారనున్నాయన్నారు. అలాగే మదనపల్లె రోడ్ రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.8 కోట్లు అమృత్‌భారత్ పథకంలో కేటాయింపులు జరిగాయన్నారు. రాజంపేట ఆర్డీవో మోహనరావు, బీజేపీ నేతలు రమేష్ నాయుడు,సాయిలోకేష్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఉత్సవాల ఏర్పాట్లు పక్కాగా చేపట్టండి

పెండ్లిమర్రి : పొలతల శైవ క్షేత్రంలో మహాశివ రాత్రి పర్వదినం సందర్భంగా మార్చి 8వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు సంబంధించి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని దేవ దాయశాఖ ఉప కమిషనర్ పట్టెం గురు ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం పొలతల క్షేత్రంలో చేపడుతున్న ఉత్సవాల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన క్యూలైన్లు, కోనేరు, పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నాగమల్లారెడ్డి, ఈఓ శ్రీనివాసులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### రూ.2 కోట్ల సొంత నిధులతో ఆటో నగర్‌లో రోడ్ల నిర్మాణం


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని ఆటో నగర్‌లో రూ.2కోట్ల సొంత నిధులతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. సోమవారం ఆటోనగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆటోనగర్‌లోని రెండు ప్రధాన వీధుల్లో రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. గతంలో గ్రామ పంచాయతీ నిధుల ద్వారా రోడ్లు నిర్మించాలనుకున్నామని, అక్కడ నిధులు లేకపోవడంతో సొంత నిధులు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. తన సొంత నిధులు రూ.2కోట్లతో రోడ్లు నిర్మిస్తున్నానన్నారు. ఆటోనగర్ అసోసియేషన్ అధ్యక్షుడు నన్నే సాహెబ్, ఉపాధ్యక్షుడు బాలయ్య, అరవేటి రాజా, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, నంగనూరుపల్లె శంకర్ పాల్గొన్నారు.

# నేటి నుంచి టెట్ కంప్యూటర్ బేస్డ్ పరీక్ష

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జిల్లావ్యాప్తంగా ఏడు పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ
- కడపలో నాలుగు, ప్రొద్దుటూరులో మూడు కేంద్రాలు
- ఈనెల 27 నుంచి మార్చి 6వ వరకు పరీక్షలు
- జిల్లా వ్యాప్తంగా టెట్ రాయనున్న 15680 మంది విద్యార్థులు



టెట్ పరీక్షల కోసం కడప ఉక్కాయపల్లెలో ఏర్పాటు చేసిన శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల

కడప ఎడ్యుకేషన్ : వైఎస్సార్ జిల్లా ఏపీ టీచర్ ఎలిజిబిలిటి టెస్టు (ఏపీ టెట్ -2024 కంప్యూటర్ బేస్డ్ పరీక్ష) మంగళవారం నుంచి జిల్లావ్యాప్తంగా కేటాయించిన పరీక్షా కేంద్రాలలో ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. జిల్లావ్యాప్తంగా ఈనెల 27వ తేదీ నుంచి మార్చి 6వ తేదీ వరకు ఈ పరీక్ష ఉదయం, సాయంత్ర రెండు పూటల నిర్వహించనున్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో కడపలో నాలుగు పరీక్షా కేంద్రాలను, ప్రొద్దుటూరులో మరో మూడు పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు ఒక పరీక్ష, సాయంత్రం 2.30 నుంచి 5 గంటల వరకు మరో పరీక్షను నిర్వహించనున్నారు. ప్రతి రోజు అన్ని పరీక్షా కేంద్రాలలో కలుపుకుని 1720 మంది విద్యార్థులు చొప్పున ఈ టెట్ పరీక్షను 9 రోజుల పాటు రాయనున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 9 రోజుల పాటు ఏడు పరీక్షా కేంద్రాలలో కలుపుకుని 15,680 మంది విద్యార్థులు పరీక్షలను రాయనున్నారు.

**ఏర్పాట్లు పూర్తి..**



నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రారంభం కానున్న టెట్ పరీక్షకు ఏర్పాట్లను పూర్తి చేశాం. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ హాల్ టికెట్‌ను సరిచూసుకుని నిర్ణీత సమయం కంటే అరగంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. అభ్యర్థులకు సంబంధించిన హాల్ టికెట్లలో ఏవైనా తప్పులుంటే సంబంధిత పరీక్షా కేంద్రంలో సరిచేసుకోవాలి.

\- మర్రెడ్డి అనురాధ, జిల్లా విద్యాశాఖ అధికారి

| కడపలో పరీక్షా కేంద్రాలివే.. | | | |
|---|---|---|---|
| టీసీ కోడ్ | పరీక్షా కేంద్రం ఉ/మ | విద్యార్థులు | అడ్రసు |
| 2033 | కేఓఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల | 410 | పులివెందులరోడ్డు, క్రిష్టాపురం, కడప |
| 2043 | కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల | 270 | పులివెందుల రోడ్డు, క్రిష్టాపురం, కడప |
| 1881 | శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ | 400 | చైన్నై-హైదరాబాదు రోడ్డు, ఉక్కాయపల్లె, కడప |
| 1885 | అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సు | 220 | ఆర్‌టీఓ ఆఫీస్ వెనుక, ఊటుకూరు, కడప |
| ప్రొద్దుటూరులో పరీక్షా కేంద్రాలివే.. | | | |
| టీసీ కోడ్ | పరీక్షా కేంద్రం ఉ/మ | విద్యార్థులు | అడ్రసు |
| 8938 | వాగ్దేవి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ | 210 | పెద్దశెట్టిపల్లె విలేజ్, ప్రొద్దుటూరు |
| 1915 | శ్రీరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ | 200 | లింగాపురం, ప్రొద్దుటూరు |
| 3477 | చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ | 200 | విద్యానగర్, పల్లవోలు, చాపాడు మండలం |

## పకడ్బందీగా నిర్వహించాలి

నేటి నుంచి ప్రారంభం కానున్న ఏపీటెట్ - 2024 (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్)ను పకడ్బందీగా నిర్వహించాలని మోడల్ స్కూల్స్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్, ఏపీటెట్ జిల్లా పరిశీలకుడు మార్తల వెంకట క్రిష్టారెడ్డి సూచించారు. కడపలోని డీఈఓ కార్యాలయంలో సోమవారం డీఈఓ మర్రెడ్డి అనురాధ ఆధ్వర్యంలో డిపార్టుమెంట్ ఆఫీసర్లతో పరీక్ష నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులంతా తప్పని సరిగా ఒరిజినల్ ఐడెంటిటి కార్డును పరీక్ష కేంద్రానికి తెచ్చుకోవాలన్నారు. నిర్ణీత సమయం కంటే గంట ముందుగా పరీక్షా కేంద్రాలకు హాజరు కావాలని సూచించారు. హాల్‌టికెట్లో ఏవైనా తప్పులుంటే సంబంధిత పరీక్ష కేంద్రంలో సరిచేసుకోవాలని తెలిపారు. అదే విధంగా అంగ వైకల్యం కలిగిన అభ్యర్థులకు అదనంగా 50 నిమిషాల సమయం కేటాయిస్తారన్నారు.

అభ్యర్థులకు ఎవైనా సందేహాలు ఉంటే 7207113040, 9133356786, 9441557508 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ మర్రెడ్డి అనురాధ, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, డిపార్టుమెంట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.


డిపార్టుమెంట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఏపీటెట్ రాష్ట్ర పరిశీలకుడు మార్తల వెంకట క్రిష్టారెడ్డి

### భారీగా వైఎస్సార్‌సీపీలో చేరికలు


అగస్టీన్ రాజును పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

జమ్మలమడుగు : జమ్మలమడుగు మండలంలో వైఎస్సార్‌సీపీలో భారీగా నాయకులు కార్యకర్తలు చేరారు. సోమవారం సాయంత్రం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డిల ఆధ్వర్యంలో మండల పరిధిలోని చిట్టిమిటి చింతల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు తానా నాయక్ ఆధ్వర్యంలో 70 కుటుంబాలు పార్టీలో చేరారు.

**పొన్నతోటలో..**

మండల పరిధిలోని పోన్నతోట గ్రామంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, రమేష్ యాదవ్‌ల ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ సట్టకారి సుబ్బరాయుడు కుమారుడు సట్టకారి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో 200 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు.

**వైఎస్సార్‌సీపీలో చేరిన డాక్టర్ అగస్టీన్‌రాజు..**

పట్టణంలోని ప్రముఖ డాక్టర్ ఎ. అగస్టీన్ రాజు వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. సోమవారం రాత్రి క్యాంబెల్ ఆసుపత్రిలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డిలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి డాక్టర్ అగస్టీన్ రాజుకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అలాగే మండల పరిధిలోని గొరిగెనూరు గ్రామంలో టీడీపీకి చెందిన యువ నాయకుడు సుధీర్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ చైర్మన్ గౌస్‌లాజం, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ బడిగించల విజయలక్ష్మీ, ప్రభుత్వ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, హృషికేశవరెడ్డి, పోచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీలో తిరుగుతున్నాడని..

### అన్న క్యాంటీన్‌లో బంధించి టైర్ల వ్యాపారిపై దాడి


టీడీపీ నాయకుల దాడిలో గాయ పడిన అమీర్ హంజా


దాడి విషయం చెబుతూ రోదిస్తున్న అమీర్ హంజా సోదరుడు ఉమర్

ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరు మండలంలోని వెంగళరెడ్డిపేటకు చెందిన కోగటం అమీర్ హంజా అనే టైర్ల వ్యాపారిని అన్న క్యాంటీన్‌లో బంధించి దాడి చేసిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. టూ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. అమీర్ హంజా టైర్ల వ్యాపారం చేసుకొని జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి 7.45 సమయంలో ఎర్రబల్లి దాదాపీర్ అనే వ్యక్తి అతనికి ఫోన్ చేసి టీడీపీ నేత వీఎస్ ముక్తియార్ పిలుస్తున్నాడని వెంటనే అన్న క్యాంటీన్ వద్దకు రావాలని చెప్పాడు. ఆ సమయంలో అమీర్ హంజా పనిలో ఉన్నప్పటికీ వెంటనే అన్న క్యాంటీన్ వద్దకు వెళ్లాడు. అక్కడికి వెళ్లగానే ముక్తియార్ అతన్ని దూషిస్తూ వైఎస్సార్‌సీపీలో పని చేస్తావా అని కొట్టుకుంటూ లోపలికి తీసుకెళ్లాడు. అక్కడున్న ఖలీల్, ఎర్రబల్లి దాదా పీర్, రెహమాన్, డాక్టర్ గౌస్, ఆజాద్, సత్తార్‌తో పాటు మరి కొందరు కలసి విచక్షణా రహితంగా అతనిపై దాడి చేశారు. చెప్పినట్లు వినకపోతే చంపుతామని వారు బెదిరించినట్లు అమీర్ హంజా తెలిపాడు. రాత్రి 9 గంటల వరకు అన్న క్యాంటీన్ లోనే అతన్ని బంధించారు. వారు చంపుతామని బెదిరించడంతో అమీర్ హంజా తన భార్యకు ఫోన్ చేసి ఇంట్లోని విలువైన డాక్యుమెంట్లు, కారును పంపించమని చెప్పగా.. ఆజాద్ అక్కడికి వెళ్లి తెచ్చాడు. అయితే కారు, డాక్యుమెంట్లు తీసుకొని కారులో ఉన్న రూ. 4 లక్షలు ఇవ్వమని అడుగగా ముక్తియార్ ఇవ్వకుండా దాడి చేశాడని అమీర్ హంజా వాపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు.

**వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇస్తే చంపేస్తారా..**

మైనార్టీలు వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇస్తే చంపేస్తారా అని అమీర్ హంజా సోదరుడు ఉమర్ తెలిపాడు. అన్న క్యాంటీన్‌లో అన్నం పెట్టాలి కానీ ఇలా బంధించి దాడులు చేయడం ఏంటని అతను ఆవేదన వ్యక్తం చేశాడు. తమది ఎంతో మర్యాద కలిగిన కుటుంబమని, కేవలం వైఎస్సార్‌సీపీలో తిరగడం వల్లనే తమపై టీడీపీ నాయకులు దాడి చేశారని అన్నాడు. సంఘటన జరిగిన విషయం తెలుసుకొని మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి, వరికూటి ఓబుళరెడ్డి పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చి అమీర్ హంజాను పరామర్శించారు.

# తల్లిదండ్రులు మందలించారని..!

- స్కూల్‌కు వెళ్లకుండా బస్సు ఎక్కి వెళ్లిపోయిన ఇద్దరు విద్యార్థినులు
- 3 గంటల్లోనే బాలికలను గుర్తించిన ప్రొద్దుటూరు త్రీ టౌన్ పోలీసులు


కానిస్టేబుళ్లను అభినందిస్తున్న త్రీ టౌన్ సీఐ వెంకటరమణ

ప్రొద్దుటూరు క్రైం : ఆ బాలికలు ఇరువురూ స్నేహితులు. ఒకే పాఠశాలలో చదువుతున్నారు. ఎప్పటిలాగే ఇద్దరూ బ్యాగులు తీసుకొని ఇంటి నుంచి పాఠశాలకు బయలుదేరారు. అయితే పాఠశాల ప్రధాన గేట్ వరకు వెళ్లి అటునుంచి ఎటో వెళ్లిపోయారు. హెచ్ఎం, తల్లిదండ్రుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ప్రొద్దుటూరు త్రీ టౌన్ పోలీసులు టెక్నాలజి సాయంతో విద్యార్థినులను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. పట్టణానికి చెందిన ఇరువురు విద్యార్థులు స్థానికంగా ఉన్న ఓ పాఠశాలలో చదువుతున్నారు. సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్తున్నామని చెప్పి ఇద్దరూ ఇంటి నుంచి బయలుదేరారు. వాళ్లిద్దరూ మాట్లాడుకుంటూ పాఠశాల ప్రధాన గేట్ వరకు వెళ్లారు. ఇరువురూ అక్కడ కొంత సేపు నిలబడి మాట్లాడుకున్నారు. పాఠశాల లోపలికి వెళ్తున్న తోటి విద్యార్థినులు వాళ్లిద్దరిని పలకరించి 'ఏం ఇక్కడే నిలబడ్డారే. స్కూల్ లోపలికి రా రా..' అని అడుగగా 'మీరు వెళ్లండి ..తర్వాత వస్తాం' అని చెప్పారు. అయితే క్లాస్‌లు ప్రారంభమైనా వాళ్లిద్దరూ పాఠశాలకు రాలేదు. వారు గేట్ బయట ఉండటాన్ని చూసిన విద్యార్థినులు ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి చెప్పారు. దీంతో ఆయన వెంటనే త్రీ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన సీఐ వెంకటరమణ బాలికల తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. పిల్లల గురించి వివరాలు సేకరించే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి సెల్‌ఫోన్ తీసుకొని ఒక బాలిక వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసింది. 'నా కోసం వెతకొద్దు.. నా గురించి పోలీసులకు ఫిర్యాదు చేయొద్దు.. ఒక వేళ అలా చేస్తే చచ్చిపోతా' అని ఫోన్‌లో బెదిరించింది.

**ఫోన్ ఇచ్చిన వ్యక్తి సాయంతో..**

బాలిక తల్లిదండ్రులకు వచ్చిన సెల్ నంబర్‌కు త్రీ టౌన్ పోలీసులు వెంటనే ఫోన్ చేశారు. తాను మైదుకూరులో ఉన్నట్లు ఫోన్ గల వ్యక్తి పోలీసులకు తెలిపాడు. తన మొబైల్ తీసుకొని ఫోన్ చేసిన విద్యార్థినులిద్దరూ ఎక్కడికి వెళ్లారని అడుగగా ఇప్పుడే నడుచుకుంటూ పోరుమామిళ్ల రోడ్డు వైపు వెళ్లారని అతను తెలిపాడు. వాళ్లిద్దరూ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయారని, బాలికలు ఎక్కడికి వెళ్లారో చూడమని పోలీసులు అతనికి సూచించారు. ఈ లోపే త్రీ టౌన్ పోలీసులు హుటాహుటిన మైదుకూరుకు వెళ్లారు. ఈ క్రమంలో ఆటోలో వెళ్తున్న బాలికలను గుర్తించి ప్రొద్దుటూరుకు తీసుకొచ్చారు. తల్లిదండ్రులు ప్రతి రోజు మందలిస్తుండటంతో మరో విద్యార్థి సాయంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు బాలిక తెలిపింది. కౌన్సెలింగ్ అనంతరం సీఐ వెంకటరమణ బాలికలను తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ కేసులో ప్రతిభ కనబరచిన హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుల్ గురివిరెడ్డిని డీఎస్పీ మురళీధర్, సీఐ వెంకటరమణ అభినందించారు.



## అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవాలయ అభివృద్ధికి కృషి

- పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి


ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న వీరభద్రస్వామి దేవస్థాన పాలక మండలి సభ్యులు

చాపాడు : జిల్లాలో ముఖ్య పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన అభివృద్ధికి పాలక మండలి కృషి చేయాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి దేవస్థాన పాలక మండలి చైర్మన్‌గా జీ వై వెంకటసుబ్బారెడ్డి అలియాస్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, సభ్యులుగా పుల్లారెడ్డి, దస్తగిరమ్మ, సావిత్రమ్మ, ఖాదరమ్మ, ఉమా మహేశ్వరి, చాపాటి శివశంకర్, శేషయ్య, ఎం.బుజ్జి, ఎక్స్ అఫిషియో మెంబర్‌గా నాగశివప్రసాద్ లు సోమవారం దేవదాయ శాఖ అధికారులు, ఆలయ ఈఓ శ్రీనివాసులు సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికార యంత్రాంగంతో కలసి త్వరలో జరగనున్న మహా శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించాలన్నారు. అలాగే ఆలయ పరిధిలో జరిగే అన్ని కార్యక్రమాలను విజయవంతంగా జరపాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరభద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి, ఎంపీపీ లక్షుమయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ కిషోర్‌కుమార్‌రెడ్డి, ఆలయ పండితులు భరత్ కుమార్ శర్మ, నరేంద్ర శర్మ, రామ గోవిందయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణరెడ్డి, పీవీ రమణారెడ్డి, సీవీ సుబ్బారెడ్డి, సుబ్బిరెడ్డి, నవీన్, వెంకట్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, చంద్ర, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, వీరారెడ్డి, జయరాజు, నిరంజన్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

**మార్చి 1 నుంచి బ్రహ్మోత్సవాలు**

మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో మార్చి 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి వారి మహా శివ రాత్రి ప్రథమ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి, ఆలయ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, ఎంపీపీ లక్షుమయ్య ఆవిష్కరించారు.

# ప్రాణం తీసిన విద్యుత్ కంచె

- బహిర్భూమికి వెళ్లి విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి


వెంకటసుబ్బయ్య (ఫైల్)


విద్యుత్ షాక్‌తో మృతిచెందిన వెంకటసుబ్బయ్య

గోపవరం : మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామానికి చెందిన పందిపాటి వెంకటసుబ్బయ్య (17) అనే యువకుడు ఆదివారం రాత్రి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. రత్నమ్మ, వెంకటసుబ్బయ్య దంపతుల కుమారుడైన వెంకటసుబ్బయ్య ఇంటర్ చదువుతూ మధ్యలో మానివేశాడు. రోజూ మాదిరే తోటి స్నేహితులతో కలిసి రోడ్డుపై నడుచుకుంటూ బహిర్భూమికి వెళ్లాడు. రోడ్డు పక్కనే మొక్కజొన్న సాగులో ఉంది. అడవి పందుల బెడద కోసం పంట సాగుచేసిన వారు పంట పొలానికి వెలుపల విద్యుత్ కంచె వేశారు. అది గమనించని వెంకటసుబ్బయ్య విద్యుత్ వైర్లు కాలికి తగలడంతో అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. తోడు వెళ్లిన మరో బాలుడి చేతికి గాయమైంది. అదే సమయంలో అదృష్టవశాత్తు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. లేదంటే మరో ఇద్దరు విద్యుత్ షాక్‌కు బలయ్యేవారు. వెంకటసుబ్బయ్య మృతిచెందిన విషయాన్ని తోటి స్నేహితులు వారి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. దీంతో బంధువులు, కుటుంబ సభ్యులు హుటాహుటిన సంఘటన ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటి వరకు బాగా ఉన్న వెంకటసుబ్బయ్య ఒక్కసారిగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహం వద్ద రోదించారు. వెంటనే బద్వేలు రూరల్ పోలీసులకు సమాచారమివ్వడంతో అర్ధరాత్రి సమయంలో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని తండ్రి చిన్న వయస్సులోనే చనిపోయాడు. తల్లే ఆలనాపాలన చూసుకునేది. కాగా పంట పొలాల చుట్టూ వేసిన విద్యుత్ కంచెల వలన ఇప్పటికే పలువురు మృత్యువాతపడగా మరి కొందరు వికలాంగులుగా మారారు. మండలంలో ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. వెంకటసుబ్బయ్య మృతికి కూడా విద్యుత్ కంచె కారణం కావడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు పంట పొలాల చుట్టూ విద్యుత్ కంచె వేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటే తప్ప ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండే అవకాశం ఉంది.

# బియ్యం వ్యాపారి పరారీపై ఎస్పీకి ఫిర్యాదు


బాధితులతో మాట్లాడుతున్న కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్

కడప అర్బన్ : చీటీల వ్యాపారం పేరుతో నగర ప్రజలకు కోట్లాది రూపాయలు టోకరా వేసి ఉడాయించిన వ్యక్తిపై బాధితులు సోమవారం స్పందనలో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. కడప నగరం చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన వ్యక్తి బియ్యం వ్యాపారంతో పాటు కొన్ని సంవత్సరాలుగా చీటీలు నిర్వహించేవాడు. ఈ క్రమంలో కోట్లాది రూపాయలతో పరారయ్యాడు. బాధితులు ఎస్పీకి చేసిన ఫిర్యాదులో రూ. 20 నుంచి 25 కోట్లు ఉంటుందని భావిస్తున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం కడపకు నెల్లూరు నుంచి వచ్చిన సదరు వ్యాపారి మొదట బియ్యం వ్యాపారం చేస్తూ, వినియోగదారులలో డబ్బులున్న వారిని ఎంచుకున్నాడు. వారికి వడ్డీలను ఆశగా చూపాడు. ఇచ్చిన వారందరికి మొదట్లో వడ్డీ డబ్బులను నెలనెలా ఇచ్చేసేవాడు. ఒకరికి తెలీకుండా మరొకరి దగ్గరి నుంచి డబ్బులను లక్షల్లో రుణాలుగా తీసుకున్నాడు. అంతేగాక రూ.5-10, 20, 30, 50 లక్షల మేరకు చీటీలను వేశాడు. అతని కుమారుడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా, కుమార్తె రాయచోటిలో దంతవైద్యురాలిలా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఉన్నట్లుండి సదరు వ్యాపారి పరారయ్యాడు. బాధితులు ఎస్పీని ఆశ్రయించగా కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్‌కు సిఫారసు చేశారు.

**బాధితుల ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకుంటాం**

బియ్యం వ్యాపారి పరారీపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఎండీ షరీఫ్ తెలిపారు.

### 9.68 లక్షల నగదు సీజ్

కొండాపురం : మండల పరిధిలోని ముచ్చుమర్రి పునరావాస కేంద్రం ఎదురుగా నూతన బైపాస్ రోడ్డులో సోమవారం కొండాపురం ఎస్ఐ యోగీంద్ర వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా తాడిపత్రి వైపు నుంచి కడపకు వెళ్లే కర్ణాటక ఎక్స్‌ప్రెస్ బస్సులో డి. వంశీకృష్ణ రూ.9.68 లక్షల నగదుతో ప్రొద్దుటూరుకు వెళుతుండగా స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదు సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.